# 112. అల్ ఇఖ్లాస్ (ప్రత్యేకించుకోవటం) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో మొత్తం 4 ఆయతులు ఉన్నాయి. ముఖ్యంగా ఏకదైవారాధన గురించి ఈ సూరా బోధించింది. ఈ సూరాకు పేరుగా పెట్టబడిన పదం ఇందులో ఎక్కడా ప్రస్తావనకు రాలేదు, కాని ఈ సూరా భావానికి సూచనగా ఈ పేరు పెట్టడం జరిగింది. ఈ సూరా ఏకదైవారాధనను వివరిస్తూ, అల్లాహ్ గుణగణాలను తెలియజేసింది. ఒకే ఒక్క దేవుడైన అల్లాహ్‌నే ఆరాధించాలని నొక్కి చెప్పింది. అల్లాహ్ ఎలాంటి అవసరమూ లేనివాడు, ఆయనకు కుమారులు ఎవరూ లేరు. ఆయనకు తండ్రి, తల్లి, భాగస్వాములు ఎవరూ లేరు. అందరూ, అన్ని వస్తువులు ఆయనపైననే ఆధారపడి ఉన్నాయి.

## 112. అల్ ఇఖ్లాస్[1] సూరా

سُوْرَةُ الْاِخْلَاصِ

అవతరణ :మక్కా ఆయతులు :4

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

**1** (ఓ ముహమ్మద్-స!) వారికి ఇలా చెప్పు: ఆయన (అల్లాహ్) నిజమైన ఆరాధ్యుడు ఒక్కడు.

قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ ۝١

**2** అల్లాహ్ నిరపేక్షాపరుడు.[2] (ఏ అక్కరా లేనివాడు).

اَللّٰهُ الصَّمَدُ ۝٢

**3** ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాడు.[3]

لَمْ يَلِدْ ۙ وَلَمْ يُوْلَدْ ۝٣

**4** ఆయనకు సరిసమానుడు (పోల్చదగిన వాడు) ఎవడూ లేడు.[4]

وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ ۝٤

---

1. పైకి చాలా క్లుప్తంగా కనిపించే ఈ సూరా భావార్థం రీత్యా చాలా గొప్పది. మహత్త్వపూర్వకమైనది. అందుకే మహనీయ ముహమ్మద్ (సఅసం) ఈ సూరాను మూడో వంతు ఖుర్ఆన్‌గా ఖరారు చేశారు. రాత్రిపూట ఈ సూరాను చదువుతూ ఉండవలసిందిగా ఆయన (స) నొక్కి వక్కాణించారు (బుఖారీ - తౌహీద్ ప్రకరణం, ఖుర్ఆన్ మహిమోన్నతుల ప్రకరణం). కొంతమంది సహాబీలు నమాజు సందర్భంగా ప్రతి రకాతులోనూ ఇతర సూరాలతోపాటు ఈ సూరాను కూడా కలిపి పారాయణం చేసేవారు. తన ప్రియసహచరుల ఈ పద్ధతిని గమనించిన మహాప్రవక్త (స) "ఈ సూరా పట్ల మీకు గల మక్కువ మిమ్మల్ని స్వర్గానికి చేరుస్తుంది" అన్నారు. (బుఖారీ- తౌహీద్ ప్రకరణం; అజాన్ ప్రకరణం; ముస్లిం - ప్రయాణీకుల నమాజు ప్రకరణం). నీ ప్రభువు పుట్టుపూర్వోత్తరాలను, ఆయన వంశ పరంపరను గురించి కాస్త వివరించమని బహుదైవారాధకులు మహాప్రవక్త (స)ను డిమాండు చేసిన నేపథ్యంలో ఈ సూరా అవతరించింది. (ముస్నదె అహ్మద్ - 5/133 - 134).
2. అంటే ఆయనకు ఎవరి అవసరమూ లేదు. ఆయన ఎవరిపైనా ఆధారపడినవాడు కాడు. అందరికీ ఆయన అవసరం ఉంది. అందరూ ఆయన పైనే ఆధారపడి ఉన్నారు. అల్లాహ్ అందరికన్నా వేరైనవాడు, నిరపేక్షాపరుడు.

3. అంటే ఆయనకు సంతానం లేదు. ఆయనకు సైతం తల్లిదండ్రులు లేరు. మరి ఆయన కూడా ఎవరినీ కుమారులుగాగానీ, కూతుళ్ళుగాగానీ చేసుకోలేదు.

4. ఆయన ఉనికిలోగానీ, ఆయన గుణగణాలలోగానీ, ఆయన అధికారాలలోగానీ ఆయనకు భాగస్వాములు లేరు. ఆయన్ని పోలిన వారూ లేరు. ఆయనకు సరిజోడీ కూడా లేరు. "ఆయన లాంటి వస్తువు సృష్టిలో ఏదీలేదు" (షూరా – 11). ఒక హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "మానవుడు నన్ను దూషిస్తు న్నాడు. అంటే నాకు సంతానాన్ని ఆపాదిస్తున్నాడు. వాస్తవానికి నేను ఒక్కడినే. నేను నిరపేక్షాపరుణ్ణి. నేనెవరినీ కనలేదు. నేనెవరికీ పుట్టనూ లేదు. నాకు సరిజోడీ కూడా ఎవరూ లేరు." (సహీహ్ బుఖారీ – ఖుల్హు వల్లాహు అహద్ సూరా వ్యాఖ్యానం). ఈ సూరా ద్వారా బహుదైవారాధకుల మూఢనమ్మకాలు, అల్లాహ్‌కు కుమారులను ఆపాదించే వారి మిథ్యావాదాలు, దైవానికి భాగస్వాములను కల్పించే వారి కాల్పనిక సిద్ధాంతాలు – అన్నీ నిర్ద్వంద్వంగా ఖండించబడ్డాయి.